05ATP03_05ATP03.qxd 03-04-2026 PM 10:58 Page 1



## ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు



సిలువ యాత్రలో పాల్గొన్న క్రైస్తవులు

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని సుంకులమ్మపాలెం ఆర్‌సిఏం చర్చి క్రీస్తూరాజు దేవాలయంలో ఫాదర్ ఎల్.జోసెఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. మొదటగా క్రిస్ట్ ద కింగ్ స్కూల్ నుండి సిలువ యాత్ర ప్రారంభమై రాగితోటపాలెం, కూరగాయల మార్కెట్, సుంకులమ్మపాలెం, కుమ్మరిగేరి విధుల మీదుగా తిరిగి క్రీస్తు రాజు దేవాలయం వరకు నిర్వహించారు. సిలువ యాత్ర అనంతరం ఫాదర్ మేసా ప్రసన్న స్లిలువలో యేసు ప్రభువు పలికిన ఏడు మాటలైన క్షమించడం, బాధ్యత, హామీ, చేయి విడవడం, దాహం, సమాప్తమైనది, ముగింపు గురించి వివరించారు. డికన్ బ్రదర్ బాలస్వామి ప్రసంగిస్తూ క్రీస్తు మరణం ద్వారా మనకు జీవం యిచ్చారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల సిస్టర్స్, జీవనాలయం సిస్టర్స్, క్రైస్తవులు పాల్గొన్నారు.

## సెయింట్ సిఎస్ఐ పీటర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణం నందలపాడు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న సెయింట్ సిఎస్ఐ పీటర్ చర్చిలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గుడ్‌ఫ్రైడే శుభ సందర్భంగా క్రైస్తవులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అలాగే యేసుక్రీస్తు సందేశంను పాస్టర్ విల్సన్‌బాబు హాజరైన వారికి వినిపించారు. అలాగే క్రీస్తు సందేశంలో 40 రోజులు ఉపవాసం ఉన్న వారికి భోజనాలు ఏర్పాటు చేశారు.

## ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా జి.పరమేష్

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



గడ్డం పరమేష్

ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా తాడిపత్రికి చెందిన గడ్డం పరమేష్‌ను ఎంపిక చేశారు. మంగళగిరిలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ సంఘం నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు ఎంపిక చేశారు. ఇందులో భాగంగా పద్మశాలి సంఘం యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా జి.పరమేష్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తూ సమావేశాలు నిర్వహించి పద్మశాలి కులస్తుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. అదేవిధంగా సంఘం అభివృద్ధి చెందే విధంగా పనిచేయాలని ఆయన సూచించారు.

## అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి

**తాడిపత్రిఅర్బన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



మృతి చెందిన షేక్ దాదాబాష

తాడిపత్రి పట్టణం టైలర్స్ కాలనీకి చెందిన షేక్ దాదాబాష (26) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. వివరాలు ఇలా వున్నాయి. షేక్ దాదాబాష బీటెక్ పూర్తి చేసి తాడిపత్రి పట్టణ సమీపంలోని అర్జాస్ స్టీల్ ప్లాంట్‌లో అప్రెంటిస్‌గా పనిచేస్తున్నాడు. షేక్ దాదాబాష గత నెల 31వతేదీ సాయంత్రం తాడిపత్రి పట్టణంలోకి వెళుతున్నానని చెప్పి ఇంటి నుండి బయలుదేరి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అదే రోజు రాత్రి వరకు తాడిపత్రిలో గాలించినా అతని ఆచూకి కనిపించలేదు. ఈ నెల 2వతేదీ రాత్రి 11.20 గంటల సమయంలో తలారిచెరువు వద్ద ఉన్న ఒక తెలిసిన వ్యక్తి ఫోన్ చేసి అతను దర్గాకు సమీపంలో గాలిమరల వద్ద చనిపోయి ఉన్నాడని సమాచారం ఇచ్చాడు. దీంతో బంధువులు వెంటనే అక్కడికి వెళ్లి చూడగా అతను తలారిచెరువు గాలిమరలు ఎదురుగా ఒక కంటైనర్ పక్కన ఉన్న చిన్న చెట్టుకు ఉరి వేసుకుని అనుమానాస్పదంగా కనిపించాడు. అయితే ఈ ఘటనపై అనుమానాలు ఉన్నాయని అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు

**యల్లనూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని మండలంలోని కొడవండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు బి.చిన్న పెద్దారెడ్డి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా వున్నాయి. యల్లనూరు మండలం తిమ్మంపల్లి చుట్టు ప్రక్కల గ్రామాల రైతులు పండించిన దానిమ్మ, అరటి పంటలను చెన్నైలోని ఫ్రూట్స్ కంపెనీలకు అమ్మిస్తామని నమ్మబలికి కర్ణాటక రాష్ట్రం, పావగడ తాలూకా, ఎగువపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, మంజునాథ్ అనే ఇరువురు దళారులు కొడవండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు చిన్న పెద్దారెడ్డి పండించిన దానిమ్మ పంటను కోసి తరలించారు. దానిమ్మ పంటకు రావాల్సిన 4,16,420 రూపాయలను తన అకౌంట్‌లో వేయించకుండా, వారి అకౌంట్‌లోకి కంపెనీ నుండి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకొని తనకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేసి కనపడకుండా తిరుగుతున్నారని వారి నుండి తనకు డబ్బులు ఇప్పించాలని రైతు చిన్న పెద్దారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయురెడ్డి తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు సమగ్ర ఆరోగ్య-జీవ-టర్మ్ బీమా పథకం అమలు చేయాలి

**- ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్**

**అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమాన్ని బలోపేతం చేయడానిక సమగ్ర ఆరోగ్య, జీవ టర్మ్ బీమా పథకంను ప్రభుత్వం తక్షణమే ప్రవేశపెట్టాలని ఫోర్టో (ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్) చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్య, నాయకులు వెంకట్ రెడ్డి, బోనెల రమేష్, విజయలక్ష్మి, శివానందరెడ్డి, బలివాడ ధనుంజయ్ రావు, గరికపాటి సురేష్, మాగంటి శ్రీనివాసరావు, నరసింహారెడ్డి,బృందబాన్ డొలై, బీరప్ప, పెద్దన్న, దెగావత్ రవీంద్ర నాయక్, చల్లగుండ్ల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ పథకం అమలు ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆరోగ్య భద్రత, ఆర్థిక రక్షణ, గౌరవప్రదమైన జీవనానికి బలమైన భరోసా కలుగుతుందని తెలిపారు.

## ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

**- మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డా.గేయానంద్

**అనంతపురం, ఏప్రిల్ 3 ప్రభాతవార్త బ్యూరో**

ప్రజలందరికీ నాణ్యమైన, శాస్త్రమైన వైద్యాన్ని అందించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం.గేయానంద్ తెలియజేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సంగమేష్ నగర్ లోనే జెవివి కార్యాలయం నందు ప్రజారోగ్యంపై జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు తమ సంపాదనలో ఎక్కువ శాతం వైద్యానికే ఖర్చు చేస్తున్న పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉందని అన్నారు. మానవుని జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల వస్తున్న గుండె జబ్బు, బీపీ, షుగర్, స్థూలకాయం వంటి దీర్ఘకాలిక జబ్బులకు ప్రతి నెల వేలకు వేలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని దీనివల్ల పేదలు, దిగువ మధ్యతరగతి వారికే కాదు సాధారణ మధ్యతరగతి ప్రజలకు కూడా వైద్యం పెను భారంగా తయారైందని ఆయన అన్నారు. ఇలాంటి పరిణామాలకు పరిష్కారాలు ఆలోచించి తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ఆయన తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రజారోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం జిడిపిలో 5శాతం కేటాయించాల్సి ఉండగా కేవలం1.5 శాతం మాత్రమే కేటాయించిందని, రాష్ట్ర బడ్జెట్‌లో కూడా 8 కేటాయించాల్సి ఉండగా 5.2 శాతం మాత్రమే కేటాయించిందని ఆయన తెలియజేశారు. ఈ రకంగా ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం సరికాదని మెరుగైన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాలను కోరారు. అనంతరం ఈనెల 5న విజయవాడలో ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య రంగం తీరుతెన్నులుపరిణామాలు అనే అంశంపై జరుగుతున్న రాష్ట్ర స్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ పి.ప్రసూన, సాకే భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు కోశాధికారి ఎస్.మహమ్మద్ జిలాన్, జిల్లా ఆరోగ్య రంగం సబ్ కమిటీ కన్వీనర్ కె.లక్ష్మినారాయణ, నాయకులు ఎస్.తిరుపాల్, ఎం.రామిరెడ్డి, కె.ప్రసాద్ రెడ్డి, వై.రామకృష్ణ, జి.ముత్యాలన్న, కె.నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి రాజధాని బిల్లుకు పార్లమెంట్ ఆమోదంపై హర్షం

**- తెలుగు యువత మండల అధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్**



కావడి ప్రవీణ్‌కుమార్

**తనకల్లు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించే బిల్లును పార్లమెంట్ ఆమోదించడం పట్ల తనకల్లు మండల తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల దీర్ఘకాలిక ఆశయానికి కేంద్ర ప్రభుత్వం న్యాయం చేసినట్లు అయిందన్నారు. అమరావతి రాజధాని బిల్లును పార్లమెంట్ ఆమోదించడంతో రాష్ట్ర ప్రజలంతా ఆనందోత్సాహాల్లో మునిగిపోయారన్నారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని రాజకీయపార్టీలు, ఎంపిలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అమరావతికి నిరంతర సహకారం అందిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడాన్ని కొంతమంది జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని, అలాంటి వారికి ప్రజలే తగిన సమాధానం ఇస్తారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అపార అనుభవంతో అమరావతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. అమరావతి భావితరాల అభివృద్ధికి కేంద్రబిందువుగా మారబోతోందన్నారు. ఇది కేవలం రాజధాని మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు ప్రతీక అని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షల ప్రకారం అమరావతినే శాశ్వత రాజధానిగా కొనసాగించాలనే సంకల్పానికి పార్లమెంట్ మద్దతు ఇవ్వడం చారిత్రాత్మకం అని పేర్కొన్నారు. పార్లమెంట్ వేదికగా వైసీపీ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించడం విచారకరమని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు అమరావతినే రాజధానిగా కోరుకుంటున్నారని, ఈ నిర్ణయం ప్రజాస్వామ్యానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల కృషి ఫలితంగానే దేశంలోని పలు పార్టీలు అమరావతికి మద్దతు తెలిపాయన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## సీతా రాములకు వెండి కిరీటాలు

**తల్లి జ్ఞాపకార్థం తనయులు భాను ప్రకాష్, అనంత కృష్ణలు రూ 4 లక్షల విలువ గల ఆభరణాలు సమర్పణ**

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**



కిరీటాలతో సుబ్బలక్ష్మి కుమారుడు

మండలంలోని మామిళ్ళ కుంట్లపల్లి లోని సీతారాముల దేవస్థానానికి ఇదే గ్రామానికి చెందిన సిద్ధన గారి నర్సింహులు భార్య సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం అతని కుమారులు భాను ప్రకాష్, అనంత కృష్ణ లు సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వాములకు రూ 3 లక్షల విలువ చేసి వెండి కిరీటాలు సమర్పించి భక్తిని చాటు కున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని వెండి కిరీటాలతో పాటు, రూ 80వెలతో చేయించిన టేకు పల్లకి, రూ 11 వేల విలువగల 11 కిలోల కంచుగంటను మాజీ సర్పంచ్ సిద్ధన గారి శ్రీరాములు నాయుడు, గ్రామ పెద్దల సమక్షంలో సమర్పించారు.

## రూరల్ మండలానికి 12 మంది ప్రత్యేక అధికారులు కేటాయింపు

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

అనంతపురం రూరల్ మండలానికి 12 మంది ప్రత్యేక అధికారులను కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో దివాకర్ సోమల దొడ్డి, ఆకుతోటపల్లి, కక్కలపల్లి, రుద్రంపేట, రాజీవ్ కాలనీ పంచాయతీలకు ప్రత్యేక అధికారిగా కేటాయింపు.ఏడి వెటర్ని డాక్టర్ సురేష్ ని నారాయణపురం, అనంత రూరల్ పంచాయతీకి కేటాయింపు. డిప్యూటీ ఎంపీడీవో వెంకట నాయుడు ని తాటిచెర్ల, రాచనాపల్లి, కురుకుంట, కందుకూరు, కక్కలపల్లి కాలనీ, అక్కంపల్లి పంచాయతీలకు కేటాయింపు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్ రావు ని కామారుపల్లి, చిన్నంపల్లి పంచాయతీలకు కేటాయింపు. ఎంఈఓ వెంకటస్వామిని ఎన్ ఎన్ కుంట,కోడిమిపంచాయతీలకు కేటాయింపు. వెటర్ని డాక్టర్ శ్వేత ని చియ్యేడు, పూలకుంట పంచాయతీలకు కేటాయింపు. ఎం ఆర్ ఓ ని కాటి గాని కాలువ పంచాయతీకి కేటాయింపు. వ్యవసాయ శాఖ అధికారి వెంకట కుమార్ ని ఆలమూరు పంచాయతీ కేటాయింపు. పి ఆర్ జె ఈ వెంకట శేషయ్య ని ఇటుకలపల్లి పంచాయతీకి కేటాయింపు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ హరి కుమార్ ని ఉప్పరపల్లి పంచాయతీకి కేటాయింపు. హార్టికల్చర్ అధికారి రత్న కుమార్ ని కట్ట కింద పల్లి పంచాయతీ కేటాయింపు. వెటర్ని డాక్టర్ ఉషా ని మనీలాపంచాయతీకి కేటాయింపు.

## పదవీవిరమణలోనూ ప్రజల ప్రేమే పెద్ద బహుమతి

**-తాజా మాజీ సర్పంచు శివరామయ్యకు చింతకుంటలో ఘనసత్కారం**



తాజా మాజీ సర్పంచు శివరామయ్యను సన్మానిస్తున్న దృశ్యం

**పుట్లూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

పుట్లూరు మండలం చింతకుంట గ్రామ తాజా మాజీ సర్పంచు శివరామయ్య పదవీకాలం ముగియడంతో గ్రామ ప్రజలు శుక్రవారం ఆయనకు అపూర్వమైన వీడ్కోలు పలికారు. పదవీవిరమణ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తూ గ్రామస్తులు అతనిపై ఉన్న అభిమానాన్ని మరొకసారి చాటిచెప్పారు. గ్రామంలోని బీరప్పస్వామి ఆలయం వద్ద సర్పంచు శివరామయ్య దంపతులకు గ్రామస్తులు పూలవర్షంతో స్వాగతం పలికారు. సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు, యువత, వృద్ధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది. శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గ్రామ అభివృద్ధిలో ఆయన పాత్రను ప్రత్యేకంగా ప్రస్తావించారు.

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం : శివరామయ్య**

ఈ సందర్భంగా మాజీ సర్పంచు శివరామయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చామన్నారు. ముఖ్యంగా గండికోట ప్రాజెక్ట్ నుంచి తాగునీటిని గ్రామానికి తీసుకువచ్చి, దశాబ్దాలుగా ఉన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఒకప్పుడు తీవ్రంగా వేధించిన తాగునీటి సమస్య ఇప్పుడు పూర్తిగా తొలగిపోయిందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందేలా చేయడం సాధ్యమైందని, గ్రామ ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని పేర్కొన్నారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా సొంత ఖర్చుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గ్రామాభివృద్ధి కోసం తన వంతు కృషి ఎప్పటికీ కొనసాగుతుందన్నారు. ప్రజల ప్రేమే అసలైన సంపదని తనపై గ్రామ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని, ఈ ప్రేమే తనకు పెద్ద బహుమతిగా భావిస్తున్నానని ఆయన భావోద్వేగంగా అన్నారు. చింతకుంట, కందికాపుల గ్రామాల ప్రజలకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. అనంతరం గ్రామస్తులు శివరామయ్య చేసిన అభివృద్ధి పనులకు గుర్తుగా ఆయనకు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు, యువత పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. చింతకుంట గ్రామంలో శివరామయ్యకు లభించిన ఈ ఘన సత్కారం, ఆయన చేసిన సేవలకు ప్రజలు ఇచ్చిన గౌరవానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు చెన్నారెడ్డి, కులశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

**ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 3, ప్రభాతవార్త**




గుడ్ ఫ్రైడే విశిష్టతను వివరిస్తున్న పాస్టర్

క్రీస్తు సిలువ వేయబడిన రోజును స్మరించుకుంటూ మండల కేంద్రంలోని సి అండ్ ఐ జి మిషన్ చర్చిలో గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. యేసు క్రీస్తు సిలువలో చివరిగా పలికిన ఏడు మాటలను ధ్యానించారు. ఏడు మాటల గురించి పలువురు బోధించారు. క్రైస్తవులు ఉదయం నుండి సాయంత్రం వరకూ ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు సిలువ త్యాగాన్ని స్మరిస్తూ ప్రత్యేక గీతాలను ఆలపించారు. పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎంజి.జయానందం మాట్లాడుతూ ఆనాడు లోక రక్షణ కోసం యేసు క్రీస్తు సిలువ వేయబడ్డారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన సన్మార్గంలో నడవాలని సూచించారు. అందరూ ప్రేమ, జాలి, దయ, కరుణ, క్షమాగుణం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి దార్ల రాజశేఖర్, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

**రేపు ఈస్టర్ వేడుకలు**

క్రీస్తు మరణించి తిరిగి లేచిన దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈస్టర్ వేడుకలు నిర్వహించనున్నట్లు మండల కేంద్రంలోని సి అండ్ ఐ జి మిషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎంజి.జయానందం, కార్యదర్శి దార్ల రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. చర్చిని పూలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**తనకల్లు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



ఆర్థికసాయం అందచేస్తున్న బైక్ భాస్కర్‌రెడ్డి

తనకల్లు మండలం చీకటిమానపల్లి పంచాయతీ పడమటివారిపల్లికి చెందిన వైఎస్ఆర్‌సిపి కార్యకర్త జె.ఆనంద్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న చీకటిమానపల్లికి చెందిన బైక్ భాస్కర్‌రెడ్డి శుక్రవారం మృతుని ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చురుకైన కార్యకర్తగా వున్న ఆనంద్ మృతి చెందడం బాధాకరమన్నారు. అనంతరం మృతుని కుమారులు జగదీష్, గోవర్ధన్, కుమార్తె శిల్పను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్‌రెడ్డి, జై చంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఆనందరెడ్డి, నాగిరెడ్డి, బాబు, రామప్ప, జెసిపి రమణ, ఆదెన్న, పసలు కిష్టప్ప, జగనన్న యూత్ లీడర్ ఉద్దాల ప్రవీణ్‌కుమార్, బాలినేని గణేష్, వైఎస్ఆర్‌సిపి సోషియల్ మీడియా బాలినేని చిన్న, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించిన టిడిపి శాశ్వత సభ్యత్వ సభ్యుడు యాట వెంకటసుబ్బయ్య

**శింగనమల ఏప్రిల్ 03 ప్రభాతవార్త**



మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయాన్ని శుక్రవారం అనంతపురం జిల్లా మాజీ టిడిపి లీగల్ సెల్ కార్యవర్గ సభ్యులు. టిడిపి శాశ్వత సభ్యత్వ సభ్యుడు యాట వెంకటసుబ్బన్న. మడకశిర అడ్వకేట్ నాగరాజు. టిడిపి కార్యకర్త యాట వెంకటమ్మలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు పార్టీ కార్యాల యంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న టిడిపి సీనియర్ నాయకుడు యాట ← వెంకటసుబ్బయ్య

## ఆర్డీటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ నిధులు విడుదలతో అనంత జిల్లా ప్రజల కల నెరవేరింది

**-రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి**



మాంచో ఫెర్రర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

ఆర్డీటి సంస్థకు ఎఫ్‌సిఆర్‌ఏ నిధులు విడుదలతో అనంత జిల్లా ప్రజల కల నెరవేరిందని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 11 నెలల పాటు కొనసాగిన ఉద్యమం కోసం పోరాడిన అనంత జిల్లా పేద ప్రజలు, ఎన్నో ప్రజా సంఘాలు, రాజకీయ, రాజకీయేతర పార్టీల సమష్టి కృషికి, కన్న కలలకు ఈరోజు కేంద్ర ప్రభుత్వం నుండి ఎఫ్‌సిఆర్‌ఏ నిధులు మంజూరుకు అనుమతి దక్కడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అనంత జిల్లాకు ఆర్డీటి సంస్థ కల్పవృక్షంగా ఉందని అటువంటి సంస్థ తిరిగి యధావిధిగా తన కార్యక్రమాలు కొనసాగించేలా ఈరోజు అనుమతి లభించినందుకు, అందుకు నిర్విరామంగా కృషి చేసిన ఆర్డీటి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్‌ను శుక్రవారం రాయలసీమ ఉద్యమ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత బండి నారాయణస్వామి, సీనియర్ న్యాయవాది రామ్‌కుమార్, పుట్లూరు భాస్కర్‌రెడ్డి, రాయలసీమ విద్యార్థి సంఘం నాయకుడు వరుణ్, బండి విహారి, కనకం నాగరాజుయాదవ్, నూర్‌మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## టి.సదుము పంచాయతీ ప్రజలకు ధన్యవాదాలు తెలిపిన తాజా మాజీ సర్పంచు సుజాతమ్మ.



టి.సదుము తాజా మాజీ సర్పంచు సుజాతమ్మ, భర్త చిన్నపరెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

**తనకల్లు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**

సర్పంచుల పదవీకాలం ముగియడంతో మండలంలోని టి.సదుము పంచాయతీ తాజా మాజీ సర ్పంచు సుజాతమ్మ పంచాయతీ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సుజాతమ్మ భర్త చిన్నపరెడ్డి మాట్లాడుతూ ఐదు సంవత్సరాల సర్పంచు పదవీకాలం ముగిసిందన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో పంచాయతీలో ఎలాంటి సంఘటనలు జరగకుండా కాలం గడిచిందన్నారు. ఈ ఐదు సంవత్సరాల్లో పెన్షన్లు పంపిణీ, సిసి రోడ్లు, తాగునీటి బోర్లు, రోడ్డు ప్రక్కల చెట్లు తొలగింపులు జరిగాయన్నారు. శక్తివంచన లేకుండా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పాలన కొనసాగించడం జరిగిందన్నారు. ఇందుకుగాను టి.సదుము గ్రామ ప్రజలు తాజా మాజీ సర్పంచు సుజాతమ్మ భర్త చిన్నపరెడ్డిలను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పివి కేకే ఐటి అధ్యాపకుడికి డాక్టరేట్

**అనంతపురం రూరల్, ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



మహేష్ కుమార్

అనంతపురం జిల్లా పివి కేకే ఐటి కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులు డా. డి. మహేష్ కుమార్ రేడియల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌లో నెట్‌వర్క్ రీకాన్ఫిగరేషన్‌తో డి జి ఎస్ మరియు కెపాసిటర్ల ఆప్టిమల్ ప్లేస్‌మెంట్ కోసం ఆప్టిమైజేషన్ అల్గోరిథమ్స్ యొక్క తులనాత్మక విశ్లేషణ" అనే అంశంపై పరిశోధన చేసి, జె ఎన్ టీ యు ఏ నుండి పీహెచ్ డి పట్టా పొందారు. ఈ పరిశోధనను డా. ఎస్. సురేష్ రెడ్డి మరియు డా. పి. సుజాత మార్గదర్శకత్వంలో పూర్తి చేయగా, కళాశాల మేనేజ్‌మెంట్, ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది ఆయనను అభినందించారు.

## షాలేము ప్రార్థనా మందిరంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

**- ప్రజలు ప్రేమ,శాంతి,దయ, కరుణ, క్షమా గుణంతో ఉండాలి.**

**- క్రీస్తు సందేశం ఇస్తున్న పాస్టర్ గోపాల్ రెడ్డి**

**పెనుకొండ ఏప్రిల్ 3 ప్రభాతవార్త**



క్రీస్తు సందేశం తెలుపుతున్న పాస్టర్ గోపాల్ రెడ్డి

పట్టణంలోని షాలేము ప్రార్థన మందిరంలో శుక్రవారం పాస్టర్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ సమాజం క్రీస్తునామం తో అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. కరుణామయిని కరుణ సమాజంపై ఉండాలని, ప్రపంచం శాంతి మార్గంలో నడవాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా పాస్టర్ గోపాల్ రెడ్డి సమాజానికి సందేశం ఇస్తూ ప్రజలందరూ ప్రేమ, శాంతి,దయ, కరుణ, క్షమాగుణంతో జీవించాలని అప్పుడే సమాజంలో ప్రజలంతా సుఖశాంతులతో శాంతియుతంగా జీవిస్తారని తెలిపారు. క్రీస్తు చూపిన మార్గంలో నడిచే ప్రజలు శాంతియుతంగా జీవిస్తారని తెలిపారు. యేసుక్రీస్తు ప్రజల కోసం తన ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. క్రీస్తుత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యంగ్ ఇండియా వెంకటేశులు, క్రైస్తవ సమాజం పెద్ద ఎత్తున పాల్గొని ప్రార్థనలు చేశారు.



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

# వాహనదారులు వ్యక్తిగత భద్రత నియమాలు పాటించాలి

**మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానా - సీఐ ప్రభాకర్**

బత్తలపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



ద్విచక్ర వాహన దారునికి హెల్మెట్ పెడుతున్న సీఐ ప్రభాకర్

వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు వ్యక్తిగత భద్రత నియమాలు పాటించినట్లయితే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోగలరని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ సూచించారు. శుక్రవారం బత్తలపల్లి కదిరి జాతీయ రహదారిపై బత్తలపల్లి సమీపంలోని టోల్ ప్లాజా వద్ద పోలీస్ సిబ్బందితో కలిసి సీఐ ప్రభాకర్ డ్రంక్ అండ్ డ్రైవ్,ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు.హెల్మెట్ లేకుండా నడుపుతున్న పలువురు ద్విచక్ర వాహనదారులను అడ్డగించివారికి అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించకుండా మద్యంసేవించి నడుపుతూ ప్రమాదాలుకొని తెచ్చుకో వద్దన్నారు. రోడ్డునియమాలుపాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునని, రోడ్డు భద్రత మన అందరి బాధ్యతని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు తమ సిబ్బంది నిత్యము వాహనాలను తనిఖీ చేస్తుంటారని వాహన డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అతివేగం ప్రమా దాలకు దారితీస్తుందన్నారు. ట్రిపుల్ రైడింగ్లకు దూరంగా ఉండాలని సూచించారు.తల్లి దండ్రులు సైతం మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.మీ కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని వాహనాలను నడపాలన్నా రు. తనిఖీలలో సిఐతో పాటు పోలీస్ సిబ్బంది రామలింగమయ్య, బాబ్జాన్,హోంగార్డులు తదితరులు న్నారు.

# శ్రీనివాస దంత క్లినిక్ ప్రారంభం

అమరాపురం ఏప్రిల్ 3 ప్రభాతవార్త



దంత క్లినిక్ ప్రారంభం దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురం నందు శ్రీనివాస దంత క్లినిక్ ను శుక్రవారం దంత డాక్టర్ మనోజ్ కుమార్ ఎస్ ప్రారంభించారు. అమరాపురం మెయిన్ రోడ్డు లోని శ్రీ గురు కృప షాపింగ్ కాంప్లెక్స్ నందు దేవత పూజా కార్యక్రమాలను కుటుంబ సభ్యుల సమక్షంలో నిర్వహించి క్లినిక్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ అధునాతన సౌకర్యాలతో దంత క్లినిక్ నుఈ ప్రాంత ప్రజలకు సౌకర్యార్థంగా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా మంగళవారం, శుక్రవారం, ఆదివారం దంత వైద్య సేవలను ప్రజలకుఅందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. ముఖ్యంగా ఎక్స్ రేసౌలభ్యం, అన్ని రకాలదంతాలకు సంబంధించిన చికిత్స తో పాటు,నోటికి సంబంధించిన శస్త్ర చికిత్సలను నిర్వహించబడునని ముఖ్యంగా ఫ్లోరైడ్ త్రాగునీటి ద్వారా దంత సమస్యలతో ఈ ప్రాంత ప్రజలు చికిత్స నిమిత్తం సుదూర ప్రాంతాలైన హిందూపురం, సిరా, పావగడ, తుమకూరు తదితర ప్రాంతాలకు వెళ్లే పరిస్థితులు లేకుండా ఉండాలనే ఉద్దేశంతో అమరాపురంలో దంత క్లినిక్ ను ఏర్పాటు చేసినట్లు కావున అమరాపురం మండల ప్రజలు ఈ సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మనోజ్ కుమార్ కోరారు. పూర్తి వివరాల కోసం7019881403,9945403959 ఫోన్ నెంబర్ల ద్వారా సంప్రదించవచ్చని ఆయన తెలిపారు

# యువత మేలుకో మత్తుకు బానిస కావొద్దు, ఎస్సై సుధాకర్ యాదవ్

సోమందేపల్లి మార్చి 3 ప్రభాతవార్త




హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటుచేసిన, ఎస్సై సుధాకర్ యాదవ్

దేశ భవిష్యత్తుకు ఈనాటి యువతే రేపటి పౌరులే అన్న చందంగా చెప్పుకుంటున్న యువత మేలుకో మత్తుకు బానిస కావొద్దు మంచి జీవన ప్రమాణాలకు అడుగులు వేయాలంటూ ఎస్ఐ సుధాకర్ యాదవ్ పిలుపు నిచ్చారు ,శుక్రవారం మండల కేంద్రంలోని వైయస్సార్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, తదితర ప్రధాన సర్కిల్లో మత్తుకు బానిసై డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ ప్రమాదాలకు గురి కావడం ,గంజాయి డ్రగ్స్ కు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవడంపై, మైనర్ బాలురు డ్రైవింగ్ చేయడంపై , హెల్మెట్ లేని ప్రయాణంపై , తదితర కష్ట నష్టాలు జరుగు విషయాలపై జరుగుతున్న సమస్యలు ప్రాణ నష్టం జీవితాల నాశనం పెడదావపడుతున్న యువతకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి వీటన్నిటిని గమనించి యువత మేలుకో సురక్షితమైన శుభకరమైన జీవితాన్ని మలుచుకో అంటూ ఎస్సై సుధాకర్ యాదవ్ యువతకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క యువత కు తెలియజేయడం ఏమిటంటే బాధ్యతాయుతమైన యువత సన్మార్గంలో సత్ప్రవర్తనతో మెలగాలని మంచి మార్గంలో జీవించడానికి ప్రయాణించడానికి ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని సూచించారు. అక్కడక్కడ జరుగుతున్న సమస్యలు నష్టాలు తదితర వాటిపై హెచ్చరిక ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి వాటిని గమనించుకునే విధంగా సూచించడం జరుగుతుందని ఎస్ఐ సుధాకర్ యాదవ్ ఈ సందర్భంగా తెలియజేశారు..

# ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష

రొళ్ల ఏప్రిల్ 3 (ప్రభాతవార్త):



సమావేశం నిర్వహించిన దృశ్యం

మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రొళ్ల ,ఆగలి రెండు మండలాల ఉపాధి హామీ టెక్నికల్ ,ఫీల్డ్ అసిస్టెంట్లతో శుక్రవారం ఉపాధి పథక సంచలకులు జిల్లా నీటి యజమాన్య సంస్థ అధికారి విజయేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో చేపట్టబోయే పనుల గురించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించాలని సూచించారు.ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగిశాయని, ఈ నేపథ్యంలో పనులు కోరిన ప్రతి కుటుంబానికి పనిని కల్పించాలని ఆదేశించారు. పని దినాలను పంచాయతీల వారీగా విభజించి ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ కు టార్గెట్లకు నిర్దేశించినట్లు తెలిపారు. టార్గెట్ ప్రకారం పనుల డిమాండ్లు పెట్టి ప్రతి గ్రామంలో కూలీలకు విడివిడిగా పనులు కల్పించాలన్నారు.ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పన్నులో క్వాలిటీ క్యాంటిటీ వుండే విదంగా చూడాలన్నారు.ఏప్రిల్,మే లో ఎండల తీవ్రతను దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం రోజువారీ కూలీల వేతనాన్ని పెంచిందన్నారు. మండుటెండలో కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే కూలీలతో పనులు చేయించాలని చెప్పారు. ప్రతి పనికి విధిగా ఫోన్లో ఫోటోలు, వీడియోలు తీసి భద్రపరచుకోని అధికారులు అడిగినప్పుడు వాటిని ఆధారంగా చూపించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపిడి జ్యోతి, డిఆర్పీలు కాటమయ్య, గోవర్ధన్, హరిబాబు, ఏపీవో ఓబులప్పాతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు,కంప్యూటర్ ఆపరేటర్లు,వివిధగ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# నేర కార్యకలాపాలు అరికట్టేందుకే డ్రోన్ కెమరా పర్యవేక్షణ...!

**డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ నిర్వహించిన పోలీసులు...!**

ధర్మవరం,ఏప్రిల్ 3,ప్రభాతవార్త



ధర్మవరం శివారు కాలనీల్లో డ్రోన్ కెమరాతో పర్యవేక్షణ చేస్తున్న టూటౌన్ పోలీసులు

పట్టణ శివారు కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అక్రమ కార్యకలాపాలు, ప్రజా భద్రతకు విఘాతం కల్గించే పరిస్థితులను గుర్తించేందుకు శుక్రవారం టూటౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో పోలీసులు డ్రోన్ కెమరాతో పర్యవేక్షణ చేశారు. సీఐ మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికపరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పలు ప్రాంతాలలోడ్రోన్ ద్వారా ఆ ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు,మార్గాలు, అనుమానాస్పదగా కనిపించే చలనాలను రికార్డు చేయడం జరిగిందన్నారు. నేర కార్యకలాపపాలను అరికట్టడంలో కీలకంగా ఈ డ్రోన్ కెమరా ఉపయోగపడుతుందన్నారు.

# ఘనంగా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు..

మడకశిర టౌన్ ఏప్రిల్ 3 ప్రభాతవార్త



రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవి శేఖర్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వైకాపనేతలు,కార్యకర్తలు.

వైకాపా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రవిశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు పట్టణం లోని వారి స్వగృహం వద్ద ఆ పార్టీ నేతలు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అభిమానులు తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎదిగినకొద్దీ ఒదిగి ఉండాలి అన్న సంకల్పంతో రవి శేఖర్ రెడ్డి రాజకీయంలో ఎదుగుతూ వచ్చారని తను నిజాయితీగా , నిక్కచ్చిగా వ్యవహరిస్తూ పార్టీఅభివృద్ధిలో తనవంతు కృషి చేస్తున్నాడని అతను భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా గుడిబండ జడ్పిటిసి భూతరాజు,బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ,మాజీ మున్సిపల్ చైర్మన్ తనయుడు జై రాజు మాజీ కౌన్సిలర్లు రేహాన్ అన్సర్ కాన్, అంజన్,ఫక్రుద్దీన్ సైఫుల్ల,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి,రూరల్ కన్వీనర్ శ్రీరాములు పట్టణ మాజీ అధ్యక్షులు సతీష్ రోళ్ళా నరసింహారెడ్డి,పట్టణ ఉపాధ్యక్షుడు మధు,రూరల్ మండలకార్యదర్శి సుధాకర్ మాజీసర్పంచ్ కరియణ్ణ,ఫణి యాదవ్,రంగధామరెడ్డి. శివగంగప్ప.మనోహర్ రెడ్డి.విశ్వనాథ గౌడ్.దొడ్డయ్య. జగన్నాథ్ రెడ్డి,తిమ్మప్ప,హనుమంతు. గోవర్ధన్. హరి. ప్రకాశ్ రెడ్డి.వైబిహళ్ళి సత్యనారాయణ రెడ్డి.నగేష్.శ్రీరాములు. రామంజి. తదితరులు పాల్గొన్నారు.

# దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ తరపున అంగన్వాడి చిన్నారులకు దుస్తుల వితరణ

పరిగి ఫిబ్రవరి 3 (ప్రభాతవార్త):



అంగన్వాడి చిన్నారులతో ట్రస్ట్ అధినేత వేణుగోపాలరావు

శ్రీ సత్య సాయి జిల్లా పరిగి మండల కేంద్రంలోని బిజెపి నాయకులు హైకోర్టు అడ్వకేట్ పరిగి వేణుగోపాలరావు తన కూతురు జ్ఞాపకార్థం దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ తరపున గ్రామంలోని పలు అంగన్వాడి కేంద్రాలలో చిన్నారులకు దుస్తుల వితరణ మరియు భోజన వసతి కార్యక్రమం నిర్వహించారు వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నా కూతురు పేరున దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని ఇవే కాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత చెకప్ కోసం వచ్చే గర్భిణీ స్త్రీలకు భోజన వసతి మరియు తల్లిదండ్రులు లేని అనాధ పిల్లలకు ఆర్థిక సహాయం ఇల్లు లేక నిరాశ్ర యులైన నిరుపేదలకు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం, అనాధ విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆర్థిక సహాయం వంటి పలు సేవ కార్యక్రమాలతో మా ట్రస్ట్ ముందుకు వెళుతుందని మానవసేవే మాధవసేవగా తలచి గ్రామం మరియు మండలంలో తనవంతుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాని తన స్వగ్రామం పై మక్కువతో చేస్తున్న కార్యక్రమాలు గ్రామా ప్రగతికి తోడ్పాటును అందిస్తుందనే మనో నిశ్చయంతో కార్యక్రమాలు చేస్తున్నానని తెలియపరిచారు, గ్రామ ప్రజానీకం వేణుగోపాల్ రావు చేస్తున్న సేవా కార్యక్రమాలకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉద్యోగులు పిల్లలు వారి తల్లిదండ్రులు గ్రామ పెద్దలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించండి

రామగిరి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త




ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి నడపాలని సిఐ శ్రీధర్ తెలిపారు. శుక్రవారం రామగిరి పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ఆటోలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు చట్ట పరమైన చర్యలు గురించి తెలియజేశారు. ప్రయాణికులను అధిక సంఖ్యలో ఎక్కించుకోవడం, వేగంగా వాహనాలు నడపడం చేయరాదన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ను గౌరవించాలన్నారు. డ్రైవింగ్ సమయంలో ఫోన్‌లో మాట్లాడవద్దన్నారు. ఆటోకు అన్ని రికార్డులు ఉంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన చిత్రాలను, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల కలిగేనష్టాల గురించి చిత్రాల రూపంలో చూపించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామభద్రతకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రదీప్‌రాజు సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయితీలకు ప్రత్యేక అధికారులు

**- ఇక పంచాయితీల పాలన ప్రత్యేక అధికారులదే**

అగళి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

ఏప్రిల్ 2వ తేదికే పంచాయితీ సర్పంచులపాలన పూర్తి కావడంతో శుక్రవారం నుంచి పంచాయితీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడంతోపాటు కలెక్టర్ పంచాయితీలకు ప్రత్యేక అధికారులనే నియమించారు. అగళి పంచాయితీకి ఎంపిడిఓ గంగాధర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరిస్తారు. రామనపల్లి, నర్సాంబుది పంచాయితీలకు తహశీల్దారు సుబ్బారావు ప్రత్యేక అధికారి. మధూడి, ఇనగలూరు పంచాయితీలకు ఐఓఆర్డి పద్మ ప్రత్యేక అధికారి. ఇరిగేపల్లి, ఆర్జిపల్లి పంచాయితీలకు రెడ్డి ప్రకాష్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. పి.బ్యాడిగెర, కోడిపల్లి పంచాయితీలకు ఏఓ రాజేంద్ర ప్రసాద్, అల్లికెర, కొమరేపల్లిపంచాయితీలకు ఏఓ నాగరాజు, హెచ్‌డి హల్లి,రావుడి పంచాయితీలకు ప్రత్యేక అధికారిగా ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడును నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులను జారీచేశారు. ఏ అభివృద్ధి పనులైనా, బిల్లులైనా వీరి సంతకంతో విడుదల కావాల్సి ఉంటుంది.

# 9న ఉరవకొండలో జరిగే ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతికు విచ్చేయండి

**-ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆహ్వానించిన ఆర్డీటీ పరిరక్షణ కమిటీ**

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆహ్వానపత్రికను అందిస్తున్న నిర్వహణ కమిటీ బాధ్యులు

ఈనెల 9వ తేదీన ఉరవకొండ పట్టణం లోని ఆర్అండ్‌బీ అతిధిగృహం ఆవరణంలో జరిగే ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 108వ జయంతి, ఆర్డీటీకు ఎఎఫ్ సీ ఆర్ ఏ పునరుద్ధరణ కృతజ్ఞతల సభకు విచ్చేయాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆర్డీటీ పరిరక్షణ కమిటీ ఆహ్వానించింది. జిల్లా కేంద్రం అనంతపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రిను మర్యాదపూర్వకంగా కలిసిన కమిటీ బాధ్యులు పుష్పగుచ్ఛంతోపాటు ఆహ్వాన పత్రికలను అందించారు. ఈసందర్భంగా పరిరక్షణ కమిటీ బాధ్యులు మాట్లాడుతూ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ కరువు జిల్లా అనంతపురంను ఎన్నుకొని 1969లో ఆర్డీటీ సంస్థను స్థాపించి నాటినుంచి నేటి వరకు వైద్యం, మహిళా సాధికారత, గృహవసతి, పర్యావరణ పరిరక్షణ, వికలాంగుల అభివృద్ధి తదితర కార్యక్రమాలను చేపడుతోందన్నారు. 1920లో జన్మించిన ఫాదర్ ఫెర్రర్ తన తుదిశ్వాస వరకు పేదల అభ్యున్నతికే పనిచేశారని అలాంటి మహనీయున్ని స్మరించుకోవడం మన బాధ్యతలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ పరిరక్షణ జేఏసీ సభ్యులు మీనుగ గోపాల్, పాల్తూరు ఆనందరాజు, చీకలగుర్కి మారెన్న, చాబాల జగదీష్, ఆమిద్యాల నారాయణస్వామి, రేణుమాకులపల్లి గోపాల్, వ్యాసాపురం మహేష్ తదితరులు ఉన్నారు.

# ఏప్రిల్ 14న పెనుకొండలో అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయండి

పెనుకొండ ఏప్రిల్ 3 ప్రభాతవార్త



మాట్లాడుతున్న బీసీవి అధ్యక్షులు శివరామకృష్ణ

పెనుకొండ మండల కేంద్రంలో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న నిర్వహించే భారతరత్న బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి నీ విజయవంతం చేయాలని బీసీ అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని చెర్లోపల్లి,పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని, కోనాపురం లో బహుజనులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ జయంతి రోజు నిర్వహించే జై భీమ్ ర్యాలీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతిని బీసీల ఆధ్వర్యంలో పెనుకొండ పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బహుజనులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక రాయలసీమ ఉపాధ్యక్షుడు చల్లపల్లి ఈశ్వర్ , స్టేట్ మైనార్టీ ఇంచార్జ్ ఆంద్రూస్, జిల్లా నాయకులు కోనాపురం కొల్లప్ప ,మారుతి,కోశాధికారి, రామాంజనేయులు, నియోజకవర్గ నాయకులు మంగాపురం లక్ష్మణ్ నాయక్ కోనాపురం ఆది, రంజిత్ గ్రామ పెద్దలు మహిళలు యువత పాల్గొన్నారు.

# కన్నుల పండువగా లంకాదహన మహోత్సవం

**- భక్తిశ్రద్ధలతో మల్లేశ్వరస్వామికి రుద్రాభిషేకం**

**- నేడు వసంతోత్సవంతో ముగియనున్న ఉత్సవాలు**

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



ఆకాశంలో మిరుమిట్లు గొలిపే బాణాసంచా వెలుగుల దృశ్యం



ప్రత్యేకాలంకరణలో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఉత్సవమూర్తులు

గతనెల 31వ తేదీన స్వస్తిశ్రీ పరాభవనామ సంవత్సరం చైత్ర శుద్ధ త్రయోదశి గురువారం నుండి ప్రారంభమైన పట్టణంలోని చోళరాజుల కాలంలో నిర్మించినట్లు భావించే పురాతన మల్లేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బహుళ పాడ్యమి శుక్రవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం జరుగగా, రాత్రి లంకాదహనం కన్నుల పండువగా జరిగింది. వందలాది మంది భక్తులు తరలివచ్చి వీక్షించారు. అంతకు ముందు స్వామివార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఊరేగింపు నిర్వహించారు. లంకాదహనంలో బాగంగా కాల్చిన బాణా సంచా అందరినీ కట్టిపడేసింది. నేడు బహుళ విదియ శనివారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, కంకణ విసర్జన, ధ్వజా అవరోహణము, సాయంత్రం విజయ వసంతోత్సవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నాయి.

# అభివృద్ధి పనుల పర్యవేక్షించిన రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు శ్రీనివాసమూర్తి

గుడిబండ ఏప్రిల్ 3 ప్రభాతవార్త



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని వీరజ్జనపల్లి, మోరుబగలు, వడ్రహట్టి, ఉప్పరహట్టి గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన రహదారులు, కల్వర్టుల నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల వల్ల విద్యార్థులు,గ్రామ ప్రజలు తమ స్వగ్రామాల నుండి వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సులభంగా రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంటుందని,ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు పూర్తిగా తగ్గుతాయని అన్నారు.అలాగే రోడ్లు, కల్వర్టులు నిర్మించడానికి కృషి చేసిన ఎంఎల్ఏ ఎంఎస్ రాజు, మాజీ ఎంఎల్సీ గుండుమల తిప్పేస్వామి లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, తెదేపా మండల అధ్యక్షులు లక్ష్మీనరసప్ప,పురుషోత్తం, తిప్పేష్,జయన్న, జగదీష్, సుదర్శన్,హనుమంతరాయప్ప,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి -ఎస్ఐ నరేంద్ర

లేపాక్షి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని చోళసముద్రం టోల్‌గేట్ వద్ద శుక్రవారం ఎస్ఐ నరేంద్ర ఆటో డ్రైవర్లకు పలు కీలక సూచనలు, జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేంద్ర మాట్లాడుతూ ప్రతి ఆటో డ్రైవర్ తప్పనిసరిగా తమ వెంట డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్, సంబంధిత ధృవీకరణ పత్రాలను ఉంచుకోవాలన్నారు. ప్రయాణీకుల భద్రత ప్రయాణీకులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపైనే ఉందన్నారు. అతివేగంగా వెళ్లకుండా ఆచితూచి వాహనం నడపాలని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, అటువంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా ప్రయాణం చేసినప్పుడే ప్రమాదాలను నివారించగలమని ఎస్ఐ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు. పెద్దసంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేంద్ర

# సహస్ర చండిక మహాయజ్ఞానికి తరలి రండి

అగళి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



విలేకర్లతో మాట్లాడుతున్న కళాశాల అధ్యక్షులు బి.గోవిందప్ప

ఈ నెల 19వ తేది నుంచి 28వ తేది వరకు బెంగళూరులోని శంకరాచార్య ఆశ్రమం శ్రీసాయి రుక్మిణి మహల్‌లో సహస్ర చండిక మహాయజ్ఞాని యాగాన్ని న్యూ బాడ్మిన్ చైర్మన్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, అందుకోసం అగళి మండలం నుంచి అత్యధికంగా భక్తులు ఈ యాగానికి తరలాలని అగళి కెజిఎ గుప్తా కళాశాల అధ్యక్షులు గోవిందప్పతెలిపారు. ఇదే విషయమై 5వ తేది మధ్యాహ్నం 3 గంటలకు వేణుగోపాల్ శిరవస్తున్నారని, అక్కడికి హాజరై విషయాన్ని సేకరించిభక్తులకు చేరవేయాలని గోవిందప్ప కోరారు. ఈ మహా చండీ యాగలంఠ పాల్గొంటే వర్షాలు రావడంతోపాటు ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని,ఆయురారోగ్యాలు కలుగుతాయని,ఐశ్వర్యం సిద్ధిస్తుందని భక్తులు విశ్వాసం. ఈ యాగాన్ని మైసూరు మహారాజు కాలంలో నిర్వహించగా అనంతరం వేణుగోపాల్ ఆధ్వర్యంలో సహస్ర చండిక మహాయాగం నిర్వహిస్తున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఎండలో జనానికి ఉపశమనం...శ్రావణ్ మజ్జిగ

**- సేవాస్ఫూర్తికి నిదర్శనం "సమాజ సేవకుడు" డాక్టర్ శ్రావణ్**

గోరంట్ల, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



మజ్జిగ పంపిణీ ప్రారంభిస్తున్న దాత శ్రావణ్

ఎండాకాలం ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గోరంట్ల ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ఉపశమనం కల్పించేలా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు "సమాజ సేవకుడు" డాక్టర్ శ్రావణ్. కొండాపురం పంచాయతీ చింతమానుపల్లి వద్ద ఉన్న మంజుల ఉమెన్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ ట్రస్ట్‌ను స్థాపించిన మంజులమ్మ, ఆమె కుమారుడు డాక్టర్ శ్రావణ్ ఇప్పటికే వృద్ధాశ్రమం నిర్వహిస్తూ అనేకమంది వృద్ధులు, చిన్నపిల్లలకు ఆశ్రయం కల్పిస్తూ, విద్యార్థులకు చదువులు నేర్పిస్తూ సేవలు అందిస్తున్నారు. అదే సేవా భావంతో గోరంట్ల మండల ప్రజలకు మరింత సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గోరంట్ల మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి రోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తుండడంతో ఎండలో వచ్చే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వారికి చల్లని మజ్జిగ అందిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా వడదెబ్బ వంటి సమస్యల నుంచి రక్షణ కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ ఎండాకాలం పూర్తయ్యేంతవరకు నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ కొనసాగిస్తామన్నారు. గత సంవత్సరంలో కూడా ఇదే విధంగా సేవలు అందించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్, కక్కల రఘునాథ్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ సుబ్బు, సోము, సంతోష్, తదితరులు పాల్గొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్న ట్రస్ట్ సభ్యులను స్థానిక ప్రజలు అభినందిస్తున్నారు.

# మృతి చెందిన చేపలను తొలగించిన మున్సిపల్ అధికారులు

గుత్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త




కుంటలో మృతి చెందిన చేపలను తొలగిస్తున్న దృశ్యం

గుత్తి పట్టణంలోని వక్కల కుంటలో గురువారం విష ప్రభావంచే మరణించిన చేపలను తొలగించేందుకు శుక్రవారం మత్స్యకారులతో వలలు వేసి వాటిని తొలగిస్తున్నారు. ఈ సంఘటనపై వార్తలో వచ్చిన కథనానికి స్పందించి మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా ఆధ్వర్యంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా యుద్ధ ప్రాతిపదికన తక్షణ చర్యలు చేపట్టారు. మత్స్యకారులను పిలిపించి తెప్పల ద్వారా వలలు వేసి మృతిచెందిన చేపలను తొలగిస్తున్నారు. కుంటలో దుర్గంధం రాకుండా బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించారు. మరో దఫా ఇలాంటి చర్యలు జరగకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.

# అమరావతి ఆంధ్రుల హక్కు...గుత్తిలో భారీ ర్యాలీ

గుత్తి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త




కూటమి నాయకులు ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఐదు కోట్ల మంది ఆంధ్రుల హక్కు అమరావతికి రాజధానిగా పార్లమెంట్ చట్టబద్ధత కల్పించడం రాష్ట్ర అభివృద్ధికి మరో ముందడుగు అని టిడిపి గుత్తి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. గుత్తి పట్టణంలో శుక్రవారం ఆర్అండ్‌బి అతిథి గృహంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పరస్పరం పంచుకున్నారు. అనంతరం ఈశ్వర్ మాట్లాడుతూ దేశంలో రాజధాని లేని ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో రాజ్యాంగబద్ధంగా అమరావతిని రాజధానిగా గుర్తించడం జరిగిందన్నారు. దేశంలో రాజ్యాంగబద్ధంగా రాజధానిగా ఏర్పడిన గుర్తింపు అమరావతికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కేంద్ర సహకారంతో విశ్వనగరంగా అమరావతిని అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం గాంధీ చౌక్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా రాజీవ్ సర్కిల్ వరకు భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు జై అమరావతి అన్న నినాదాలతో దద్దరిల్లిపోయింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, పార్టీ కన్వీనర్లు, కార్యదర్శులు ఎంకే చౌదరి, లక్ష్మీరంగయ్య, మారుతిప్రసాద్, సాంబశివయాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు బద్రివలి, న్యాయవాది సోమశేఖర్, ఆర్ఎస్ రాజా, పిల్లెలి సుధాకర్, కృష్ణయ్య, రామకృష్ణ, సునీత, సరోజ, బిజెపి కన్వీనర్ వెంకప్ప, జనసేన కన్వీనర్ సురేష్, వెంకటేష్ నాగయ్య, ఓబులేసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

09ATP27_09ATP27.qxd 03-04-2026 PM 10:30 Page 1



## రక్తదానం చేయండి ప్రాణదాతలుకండి...!

ధర్మవరం, ఏప్రిల్3,ప్రభాతవార్త



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆత్మీయట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి,విద్యార్థులు

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆత్మీయ ట్రస్టు చైర్మన్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఆత్మీయ ట్రస్టు కార్యాలయంలో విద్యార్థులతో కలిసి పోస్టర్లను ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....యువతీయ ఎవకులు ముందుకు వచ్చి తమవంతుగా సమాజానికి చేయూత నివ్వాలని ఆయన సూచించారు. ఆత్మీయట్రస్టు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమంలో భాగంగా రక్తదానం, నేత్రదానంపై అవగాహన కల్పించడమే ఈ ఏడాది ట్రస్టు లక్ష్యంగా పెట్టుకుందన్నారు.18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు కనీసం 45 కిలోల బరువు కలిగి తగిన హిమోగ్లోబిన్ శాతం కలిగినవారు ప్రతి మూడునెలలకొకసారి స్వచ్ఛంద రక్తదానం చేయవచ్చన్నారు. అలాగే నేత్రదానం చేయడానికి అందరూ ముందుకు రావాలన్నారు.

## యాదవ సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ నాగవేణి జితేంద్ర కు ఘన సన్మానం

అమరాపురం ఏప్రిల్ 2 ప్రభాతవార్త



సర్పంచ్ నాగవేణి హితేంద్రకు ఘన సన్మానం దృశ్యం

మండల పరిధిలోని వలస గ్రామంలోని సచివాలయంలో శుక్రవారం స్థానిక సర్పంచ్ నాగవేణి జితేంద్రకు యాదవ సంఘం తరఫున ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ గతంలో ఎంతోమంది సర్పంచులను ఎన్నుకున్నామని కాని చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరికి తగినటువంటి గుర్తింపునిస్తూ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరిస్తూ ఐదు సంవత్సరాలు సర్పంచ్ పదవికాలాన్ని తన సొంత పనిగా విధులను నిర్వచించినటువంటి ఏకైక సర్పంచ్ నాగవేణి హితేంద్ర ని కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ తండ్రి లాయర్ బసప్ప మాట్లాడుతూ గతంలో ఎంతోమంది సర్పంచులుగా విధులు నిర్వహించారు. ఇంత గౌరవం ఎవరికి దక్కలేదు అని ఆయన పేర్కొన్నారు. ఈ సన్మానాన్ని చూసి ఆయన ఆనంద భాష్పాలుతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. స్థానిక సచివాలయం నుంచి తన ఇంటి వరకు డప్పు వాగ్దాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి వారి ఇంటికి చేర్చారు. ఈ సందర్భంగా నాగవేణి హితేంద్ర మాట్లాడుతూ ఈ గ్రామ పంచాయతీలో ఉన్నటువంటి గ్రామాలలో ఏ అభివృద్ధి చేయడానికి అయినా అడ్డు వేయకుండా అన్ని విధాలుగా సహకరించినటువంటి ఈ పంచాయతీ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా ఈ గ్రామ పంచాయతీ అభివృద్ధికి తోడ్పడినటు వంటి గ్రామపంచాయతీ కార్యదర్శులు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈరోజు పదవి కాలం ముగియడంతో ఈ గ్రామ పంచాయతీ ప్రజలు నన్ను గుర్తించి ఇంత భారీగా సన్మానం చేసినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డీలర్ రాధాకృష్ణ, మాజీ డీలర్ శివన్న, బాలకృష్ణ, జీవి మంజునాథ్, క్రిష్టప్ప, రామాంజనేయులు, శివన్న భారీగా యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## రేపు కళాజ్యోతిలో ఘంటసాల వర్ధంతి వేడుకలు...!

ధర్మవరం,ఏప్రిల్ 3,ప్రభాతవార్త

పట్టణంలోని కళాజ్యోతి ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం 6 30గంటలకు ఘంటసాల వర్ధంతి వేడుకలను నిర్వహించనున్నట్టు కళాజ్యోతి కమిటి అధ్యక్షులు నారాయణ, కార్యదర్శి బాలగొండ రామకృష్ణలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆర్ అండ్ బీ ఎస్ఈ సంజీవరాయుడు హాజరవుతారన్నారు. అలాగే ప్రముఖ గాయకులు శివప్రసాద్, కాకినాడ బృందం చే ఘంటసాల పాటల కచేరి ఉంటుందన్నారు. ఈ వేడుకలకు ప్రజలు తంరలిరావాలని వారు కోరారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

కంబదూరు, ఏప్రిల్ 3 ప్రభాతవార్త,



చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కంబదూరు మండల కేంద్రంలోని సి అండ్ ఐ జి మిషన్ చర్చ్ లో శుక్రవారం గుడ్ గుడ్ ఫ్రైడే వేడుకలను పాస్టర్ జేమ్స్ ఆధ్వర్యంలో క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరై ప్రార్థనలు చేశారు. ప్రభువైన ఏసుక్రీస్తు కల్వరి శిలువలో తన రక్తం చిందించడం వల్ల సర్వ మానవాళికి విమోచనం కలిగిందని పాస్టర్ జేమ్స్ బైబిల్ సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు, క్రీస్తు విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

బత్తలపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



క్రీస్తు ఆరాధన మందిరంలో సందేశం వినిపిస్తున్న పాస్టర్ పాల్ రాజన్

యేసుక్రీస్తు శిలువ పై ప్రాణత్యాగం చేసినరోజు గుడ్ ఫ్రైడే. ఆ వేడుకలు బత్తలపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మండలం లోని అన్ని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి క్రీస్తు జీవితవిశేషాలపై గేయాలను ఆలపించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రిష్టియన్లు బత్తలపల్లికి చేరుకుని చర్చిలలో ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని క్రీస్తు ఆరాధన మందిరంలో పాల్ రాజన్ ఎస్ఈఎఫ్ చర్చిలో సీహెచ్.పాల్, బెలివరో చర్చిలో విటి. సుదర్శన్, భక్తిసింగ్ సంఘం చర్చిలో ప్రభాకర్, రక్షణ సంఘం చర్చిలో శాంతరాజ్, రివైవల్ చర్చిల్లో రూపాసుహాసిని పాస్టర్లు ఇచ్చిన సందేశాలను ఆలకించారు. క్రీస్తు రక్తంతో పాపప్రక్షాళన జరిగిన రోజు గుడ్ ఫ్రైడే. ఆరోజు పలికిన ఏడు మాటలు గురించి వివరించారు. క్రీస్తు పునరుత్థానంతో సంబరం అంబరాన్ని అంటిన రోజు ఈస్టర్, నైతికవర్తన, శాంతి ఒక దానికొకటి ముద్దాడిన సందర్భాలు కూడాగుడ్డెడే, ఈస్టర్లనిఫాస్టర్లు విశదీకరించారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలలో సైతం గుడ్ ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఆదివారం ఈస్టర్ వేడుకలను నిర్వహించేందుకు చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. ఆర్డిటి ఆసుపత్రిలో గుడ్ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

## ఆర్డిటికీ ఎఫ్సిఆర్ఏ రెన్యువల్‌తో పేదల జీవితాలలో వెలుగులు

ఫీల్డ్ ఆఫీసులో మాంచో ఫెర్రర్‌ను కలిసిన ప్రజాసంఘాల నాయకులు



మాంచూ పెర్రర్‌ను కలిసిన ప్రజాసంఘాల నాయకులు

బత్తలపల్లి, ఏప్రిల్ 3 ప్రభాతవార్త

ఆర్డిటి స్వచ్ఛంద సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్సిఆర్ఏ రెన్యువల్ చేయడంతో పేదల జీవితాలలో వెలుగులు వచ్చాయని, సంస్థ తమ సేవా కార్యక్రమాలను ఉమ్మడి జిల్లాలో మరింత విస్తృత పరచాలని ప్రజా సంఘాల నాయకులు ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచు ఫెర్రర్ను కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని ఆర్డిటి ఫీల్డ్ కార్యాలయానికి విచ్చేసిన ఆర్డిటి ప్రోగ్రాం డైరెక్టర్ మాంచు ఫెర్రర్ ను పలువురు ప్రజా సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందిస్తూ ఆర్డిటికి ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ అనుమతి లభించిన సందర్భంగా శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆర్డిటి సంస్థ మరింత విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఆర్డిటి సంస్థకు ఎఫ్సిఆర్ఏ అనుమతి కోసం నిరంతరం శ్రమించి అనుమతి వచ్చే వరకు ఎలాంటి పోరాటాలు లేకుండా సమన్వయంతో పని చేశామని తెలిపారు. ధర్మవరం బిఎస్పి ఇంచార్జి సాకే వినయ్ కుమార్ మాట్లాడుతూ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ సంస్థలో గత 20 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న ఉద్యోగులకు తగినంత జీతాలు ఇవ్వడం లేదని, అందువల్ల వారికి ఆర్థిక భారంగా మారిందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆర్డిటి ఆసుపత్రి,ఇతర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు పెంచాలని ఎఫ్సిఆర్ఏ అనుమతి వచ్చిన సందర్భంలో ప్రత్యేకంగా అభ్యర్థించారు. అదేవిధంగా గతంలో ఉన్న విధంగా స్టాఫ్ పిల్లలకు ఉచిత విద్యా సదుపాయం, ఇతర సంక్షేమ పథకాలు కొనసాగించాలని కోరారు. ఇందుకు మాంచుపెర్రర్ స్పందిస్తూ కచ్చితంగా వాటిపై దృష్టి సారిస్తామని ఉద్యోగులను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. అనంతరం ఎఫ్సిఆర్ఏ పోరాట ఉద్యమానికి మద్దతు తెలిపి విజయంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరిని అభినందిస్తూ, ఈ విజయంలో అందరి కృషి ఉందని మాంచూ ఫెర్రర్ పేర్కొన్నట్లు పోరాట సంఘాల నాయకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆర్డిటి సేవలు మరింత విస్తరించి పేద ప్రజల అభివృద్ధికి సేవలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి రీజినల్ డైరెక్టర్ హనుమంతప్ప, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, ఎస్సీ జనసంఘం రాష్ట్ర ఇంచార్జి మాల్యవంతం రామ్ ప్రసాద్, బిఎస్పీ ధర్మవరం ఇంచార్జ్ సాకే వినయ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే కుళ్లాయప్ప, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉమ్మల చంద్రశేఖర్, గుమ్మళ్లకుంట రైతు వరిమడుగు కుళ్లాయిరెడ్డి, ఆర్డిటి సిబ్బంది పాల్గొన్నారు.

## పాలిసెట్-2026కు దరఖాస్తుల స్వీకరణ గడువు 9వ వరకు పెంపు

-ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రిఫ్ అలీ

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.అశ్రిఫ్ అలీ

పాలిసెట్-2026కు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 9వ తేదీ వరకు పొడగించారని మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశ్రిఫ్ అలీ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడారు. 10వ తరగతి పరీక్షకు హాజరైన విద్యార్థులు, హెల్ప్‌లైన్ సెంటర్ ద్వారా, మీసేవ కేంద్రంలోగాని, ఇంటర్‌నెట్ సెంటర్‌లోగాని దరఖాస్తుతో పాటు ఓసీ, బీసీ విద్యార్థులు 400 రూపాయలు రుసుములు చెల్లించాలన్నారు. ఎసీ్స, ఎస్టీ విద్యార్థులైతే 100 రూపాయలు రుసుమును చెల్లించాలన్నారు. పాలిసెట్‌లో పరీక్ష 25న నిర్వహించడానికి అన్ని సన్నాహాలు చేయడం జరుగుతోందన్నారు. ఉరవకొండ పాలిటెక్నిక్‌లో దరఖాస్తు చేయడానికి ప్రత్యేక సహాయ కేంద్రంను ఏర్పాటు చేయడం జరిగిందని దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిటెక్నిక్‌లో అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం 50వేల రూపాయలు స్కాలర్‌షిప్ ఇవ్వడం జరుతోందన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ వరిస్తుందని వివరించారు. ఉచిత హాస్టల్ వసతి కల్పించబడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కమీషనర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్త, ఎస్.బి.టి.టి.సెక్రటరీ ఉత్తర్వుల మేరకు 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏప్రిల్ 22వ తేదీ వరకు పాలిసెట్ ప్రవేశ-2026 పరీక్షకు ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందిస్తామన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు డా॥సులోచన, డా॥నిత్య లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంపై పిడి విజయప్రసాద్ సమీక్ష

ఉపాధి కూలీల శాతం పెంచాలని సూచన

ముఖ ఆధారిత హాజరు విధానంపై అవగాహన

గుడిబండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఉపాధి హామీ పథకం అమలు విధానంపై పిడి విజయ ప్రసాద్ ఎపిడి జ్యోతి తోకలిసి ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ పథకం పనుల పురోగతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను మరింత పెంచే దిశగా ఉపాధి హామీ పథకంలో కూలీల శాతం పెంచాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెట్టిన కూలీల ముఖ ఆధారిత హాజరు విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పనులు జరుగుతున్న ప్రదేశాల్లో ఉపాధి శ్రామికుల హాజరు నమోదు సమయంలో ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని, పథకం పనులు పారదర్శకంగా నిర్వహించి శ్రామికులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం చేకూరేలా పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎపిఓలు జగదీష్, శివన్న, జెఈ లు జగదీష్, ఈరన్న అమరాపురం, గుడిబండ మండలాల టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## న్యూ సీఅండ్ ఐజీ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు

కంబదూరు ,ఏప్రిల్ 3, ప్రభాతవార్త

కంబదూరు మండల కేంద్రంలోని న్యూ సిఅండ్ ఐజి మిషన్‌చర్చ్‌లో గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరై చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సమస్త మానవాళిని రక్షించేందుకు యేసు క్రీస్తు సిలువలో రక్తం చిందించారని చర్చి ఫాదర్ సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జోయల్, సెక్రటరీ ప్రభాకర్, జాయింట్ సెక్రెటరీ పౌల్ , ట్రెజరర్ నతానీయోలు, జాయింట్ ట్రెజరర్ ప్రేమ్ కుమార్, కమిటీ సభ్యులు సోమశేఖర్, రేషం కృపానందం, యోన తదితరులు పాల్గొన్నారు.

## గుడ్ ఫ్రైడే సందర్బంగా జీసస్ విజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రదర్శన

-ప్రభుత్వ ఆసుపత్రి, విఠల్ రుక్మిణీ ఆశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ



ఉరవకొండలో ప్రదర్శన నిర్వహిస్తున్న జీసస్ విజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ బాధ్యులు

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం ఉరవకొండ పట్టణంలో జీసస్ విజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రదర్శన నిర్వహించింది. యేసు క్రీస్తు ప్రభువు సిలువపై మన పాపాలు మోసి సిలువ శ్రమను సహించి ప్రేమ క్షమాపణ, అవకాశం, ఆదరణ, బాధ్యత అనే అంశాల ద్వారా ప్రజలందరూ మంచి గుణాలతో, ప్రేమతో బ్రతకాలని సిలువలో తెలియజేశారని వివరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో రోగులకు, విఠల్ రుక్మిణీ విజయ వృద్ధ అనాథాశ్రమంలో వృద్ధ అనాథలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీసస్ విజన్ పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ఉరవకొండ అధ్యక్షుడు జాషువా ఆనంద్, ఉపాధ్యక్షుడు లేపాక్షి, కార్యదర్శి జీవరత్నం, సహాయ కార్యదర్శి రామాంజినేయులు, కోశాధికారులు ఎర్రిస్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యేసు తన రక్తముతో కడిగి పరిశుద్ధులను చేయడానికే మానవుడై జన్మించెను

-ప్రత్యేక ప్రసంగీకులు బ్రదర్ నరేంద్ర తేజ, సంఘ కాపరి యం.ప్రమీలా జోసఫ్ -ఉరవకొండలో భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు, భక్తి గీతాలాపనలు

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



సందేశాన్నిస్తున్న ప్రత్యేక ప్రసంగీకులు విజయవాడకు బ్రదర్ నరేంద్ర తేజ. చిత్రంలో సంఘ కాపరి యం.ప్రమీలా జోసఫ్

యేసు ప్రభువు 2025 సంవత్సరాల క్రితం మానవుడై ఈ లోకానికి వచ్చారని ప్రజలను పాపములు, శాపముల నుండి విడిపించి ఆయన అమూల్యమైన రక్తముతో కడిగి పరిశుద్ధులుగా చేసి వారికి పరలోక రాజ్యమైన స్వర్గానికి తీసుకెళ్లడమే ఆయన ముఖ్య ఉద్దేశమని విజయవాడ నుండి వచ్చిన ప్రత్యేక ప్రసంగీకులు బ్రదర్ నరేంద్ర తేజ, పాస్టర్ ప్రమీలా జోసఫ్ అన్నారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

గుడ్ ఫ్రైడే (శుభ శుక్రవారం) సందర్భంగా ఉరవకొండ పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, యేసు క్రీస్తును కీర్తిస్తూ గేయలాపనలు యేసు క్రీస్తు ప్రభువు సిలువపై పలికిన ఏడు మాటల గూర్చి ధ్యానించే కార్యక్రమాలు భక్తిశ్రద్ధల నడుమ కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యేసు ప్రభువు సిలువపై మన పాపాలు మోసి సిలువ శ్రమను సహించి ప్రేమ క్షమాపణ, అవకాశం, ఆదరణ, బాధ్యత అనే అంశాల ద్వారా ప్రజలందరూ మంచి గుణాలతో, ప్రేమతో బ్రతకాలని సిలువలో తెలియజేశారన్నారు. యేసు మార్గం సత్య, జీవం అని ప్రజలను మంచి మార్గంలో నడిపించారన్నారు. ప్రేమ కలిగి అందరూ జీవించాలని ఆయన ఎంతో ఆకాంక్షించారన్నారు. కాగా మండల వ్యాప్తంగా అన్ని చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు, సంగీత కార్యక్రమాలు కొనసాగాయి. సీఎస్ఐ చర్చిలో జరిగిన కార్యక్రమాల్లో సంఘం కార్యదర్శి ఎం.ఎన్.షాహీన్, కోశాధికారి ఎం.భాస్కర్‌బాబు, సంఘం పెద్దలు ఎస్.డేవిడ్, ఎస్.భాస్కర్, రాజేశ్వరి భూషణం, లాల్ ప్రసాద్, మోహన్, ఆర్.దావీదు, సుజాత చందు, మీనుగ వంశీబాబు, ఎస్.విజయ్‌కుమార్, స్త్రీల మైత్రి సంఘం యవ్వనస్తుల సంఘం, సండే స్కూల్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఆది ఆంధ్రుడి దీపోత్సవం

వేలాదిగా తరలి వచ్చిన భక్తులు

ఏర్పాట్లు చేసిన ఆలయ ధర్మ కర్త రమాకాంత్ రెడ్డి

5000 మందికి అన్నదానం చేసిన బెంగళూరు బాలాజీ కుటుంబం

సోమందేపల్లి మార్చి 3 ప్రభాతవార్త



గజ స్థంభం పై దీపోత్సవం వెలిగిస్తున్న యువకులు

మండలంలోని గుడిపల్లి గ్రామంలో వ్రైభవంగా ఏర్పాటుచేసిన సజ్జ కంట రంగనాథ స్వామి దేవాలయంలో ఆది ఆంధ్రుడి దీపోత్సవం అంగరంగ వైభవంగా ఆలయ ధర్మకర్త , ఆలయంఅర్చకులు, ఘనంగా నిర్వహించారు శుక్రవారం ఉదయం 6 గంటల నుండి 7 గంటల్లో ఆది ఆంధ్రుడు దీపోత్సవం యువకులు అక్కడ ఏర్పాటు చేసిన



వేలాది మందికి అన్నదానం ఏర్పాటుచేసిన బెంగళూరు బాలాజీ కుటుంబ సభ్యులు

ధ్వజ స్థంభం పైకెక్కి దీపాన్ని వెలిగించారు ఈ దీపోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుండి వేలాదిమంది తరలివచ్చారు అయితే ఈ దీపోత్సవాన్ని చూసి, తిలకించి చూసినట్లయితే తమ కోరిన కోర్కెలు తీరుతాయని ఇక్కడ ముందు తరాల నుండి ఆచారం , ఆనవాయితీ అని పలువురు తెలియజేస్తున్నారు. గత వారం రోజుల నుండి వివిధ పూజా కార్యక్రమాలు, దీప ధూప నైవేద్యాలు, స్వామివారికి ప్రత్యేక అలంకరణలు ,వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తుల తిలకించడానికి ఏర్పాట్లు చేయడం ఆనవాయితీ అదే విధంగా బెంగళూరుకు చెందిన బాలాజీ కుటుంబం గత ఎన్నో సంవత్సరాల నుండి ఇక్కడ అన్నదానం ఏర్పాటు చేయడం ఆనవాయితీ రెండు రోజుల మునుపే ఇక్కడికి చేరుకొని అన్నదానానికి కావలసిన అన్న ఏర్పాట్లను దగ్గరుండి చూసుకుంటూ తమ వంతు కృషి చేస్తామని బాలాజీ కుటుంబం సభ్యులు వివరించారు. ఈకార్యక్రమంలో ఆలయధర్మకర్త రమాకాంత్ రెడ్డి, అన్నదాన దాత బెంగళూరు బాలాజీకుటుంబం, ఆలయ అర్చకులు, గుడిపల్లి గ్రామ పెద్దలు, మహిళలు, వేలాదిమంది భక్తాదులు పెద్ద ఎత్తున ఉన్నారు. అన్నదానం ఏర్పాటు చేసిన కుటుంబానికి అక్కడికి విచ్చేసిన భక్తాదులందరూ వారు ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలను అభినందనలు తెలియజేశారు.

## రాకెట్లలో శిథిలావస్థలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయాన్ని పునఃనిర్మించండి

- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను విన్నవించిన ఆర్‌డీఎఫ్ బాధ్యులు

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి సత్కరిస్తున్న రాకెట్ల డెవలప్‌మెంట్ ఫోరం బాధ్యులు

మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలోగల శిథిలావస్థలో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయాన్ని పునః నిర్మించాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను రాకెట్ల డెవలప్‌మెంట్ ఫోరం (ఆర్‌డీఎఫ్) బాధ్యులు విన్నవించారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని రామ్‌నగర్‌లోగల క్యాంపు కార్యాలయంలో మంత్రిను మర్యాదపూర్వకంగా కలిసిన ఫోరం బాధ్యులు ఆయనకు షాలువాకప్పి పూలమాలతో సన్మానించి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రికు చెన్నకేశవస్వామి ఆలయ విశిష్టతను తెలియజేశారు. దీంతో మంత్రి పయ్యావుల కేశవ్ స్పందిస్తూ ఆలయ అభివృద్ధికి తప్పక తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఎఫ్ గౌరవాధ్యక్షుడు నెట్యం రమణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## సూపర్-60 ఉచిత శిక్షణకు విద్యార్థుల ఎంపికకై ఆఫ్‌లైన్ పరీక్ష

- ప్రతిభ ఆధారంగా 40 మంది ఎంపిక, నేడు కూడా కొనసాగనున్న పరీక్ష



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న నిస్వార్థ ఫౌండేషన్ చైర్మెన్ తాటికొండ వెంకట్

ఉరవకొండ, ఏప్రిల్ 3 ప్రభాతవార్త



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సూపర్-60 ఉచిత శిక్షణకు విద్యార్థుల ఎంపికకై శుక్రవారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ స్టడీ, యోగా కేంద్రంలో మోదటి దశ ఆన్‌లైన్ పరీక్షలో ఎంపికైన 100 మంది విద్యార్థులకు రెండవ దశ ఆఫ్‌లైన్ పరీక్ష జరిగింది. ఈ సందర్భంగా నిస్వార్థ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తాటికొండ వెంకట్ మాట్లాడుతూ ఆఫ్‌లైన్ పరీక్షలో 40 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని ఇంకా మిగిలిన 20 సీట్లకు శనివారం ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. పిల్లలకు శిక్షణ సమయంలో ప్రతిరోజూ దాన ధర్మ చారిటబుల్ ట్రస్టుచే మధ్యాన్న భోజనం, ఎస్.కె రిక్రియేషన్ క్లబ్‌చే స్టడీ మెటీరియల్ అందించడం జరుగుతుందన్నారు. 30 రోజుల సూపర్-60 శిక్షణ శిబిరానికి లయన్స్ క్లబ్ వసతి సౌకర్యం కల్పిస్తుండగా పీజీఎస్ ఖాజా చల్లటి నీటిని అందిస్తుండగా నిస్వార్థ ఫౌండేషన్ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తారన్నారు. ప్రతిరోజూ చదివించి పరీక్ష నిర్వహించి విశ్లేషణ చేయడం జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఒక ప్రముఖ వ్యక్తిని ఆహ్వానించి వారి జీవిత పాఠాలు చెప్పించడం, యోగాసనాలు, ధ్యానం చేయించడం జరుగుతుందన్నారు. శనివారం మధ్యాన్నం నుండి శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నిస్వార్థ ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, చంద్రమోహన్, శ్రీనివాసులు, మణి, లక్ష్మి, సాయి జోత్స్న, ఎర్రిస్వామి, నీలిమ, శంకరయ్య, మల్లేష్‌బాబు, జగన్నాథ్, రవి, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిదర్శనం అయ్యగార్లపల్లి..

- సేవా గుణానికి, గొప్ప సన్మానం..

- అయ్యగార్లపల్లి సర్పంచ్, భారతి మంజునాథ్ దంపతులకు,ఘన సన్మానం

శెట్టూరు, ఏప్రిల్ 03 ప్రభాతవార్త



సర్పంచ్ భారతి మంజునాథ్ లను సన్మానిస్తున్న వైసీపీ శ్రేణులు

మండల పరిధిలోని అయ్యగార్లపల్లి గ్రామ, అభివృద్ధి కోసం, అహర్నిశలు, కృషిచేసిన, నాయకులకు గౌరవం దక్కడం ఆదర్శనీయమని, వైస్సార్ కాంగ్రెస్,పార్టీ నాయకులు కొనియాడారు. అయ్యగార్లపల్లి పంచాయతీ సర్పంచ్ కె భారతి పదవి కాలం ముగిసిన సందర్భంగా స్థానిక పార్టీ నాయకులు వారిని ఘనంగా సన్మానించారు. అయ్యగార్లపల్లిని అభివృద్ధి పథంలో నిలిపారని వైసీపీ శ్రేణులు సర్పంచ్ సేవలను కొనియాడారు. అనంతరం వారు మాట్లాడుతూ..సర్పంచ్ భారతి పదవి చేపట్టినప్పటి నుండి, గ్రామంలో, మోలిక, సదుపాయాల కల్పనలో,కీలక పాత్ర పోషించారని, తెలిపారు. అలాగే ప్రస్తుత, జెడ్పిటిసి, కె మంజునాథ్ పార్టీ అధికారంలో, ఉన్న సమయంలో, మండల వ్యాప్తంగా,అనేక అభివృద్ధి పనులను చేస్తూ... అందరినీ, సమన్వయం, చేసుకుంటూ, ప్రజలకు నిరంతరం, అందుబాటులో ఉన్నారని, వారు గుర్తు చేసుకున్నారు. సర్పంచ్ దంపతులకు సేవలను గుర్తించి, నాయకులు, చేసిన, ఈ సన్మానం గ్రామంలో, చర్చనీ అంశంగా, మారింది భవిష్యత్తులో, ఇలాంటి, సేవా కార్యక్రమాలు, మరెన్నో చేయాలని ఆకాంక్షించారు,. ఈ కార్యక్రమంలో. బి.శ్రీనివాస్ రెడ్డి పంచాయితీ రాజ్ జిల్లా ఉపాధ్యక్షులు జి.వీరభద్ర ప్ప మాజీ సర్పంచ్,, పోస్ట్ రామకృ ష్ణ మార్కెట్ యార్డ్ చైర్మన్ మాజీ, బాబురావు మాజీ సర్పంచ్, విజయ్ కుమార్ బీసీ సెల్, తాలూకా అధ్యక్షులు, పూజారి బాలయ్య మాజీ ఎంపీటీసీ తంజీల్ భాష మైనార్టీ సెల్ జిల్లా కాసిం ఖాన్ వాణిజ్య విభాగం తాలుక, మంజునాథ్ పెద్దింటి, ట్రేడ్ యూనియన్ మండలం,గౌరయ్య వై సిపి సీనియర్ నాయకులు, గొల్ల కర్రెన్న, మారుతి బీసీసెల్ జనరల్ సెక్రెటరీ మండలం, చిన్న సూగేపల్లి మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పశువుల సంతలో 1,53,000 ఆదాయం

గుడిబండ ఏప్రిల్ 3 ప్రభాతవార్త

మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే పశువుల సంత ద్వారా రూ.1,53,000 ఆదాయం వచ్చినట్లు డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజు నాయక్ తెలిపారు.గత సంవత్సరం కాంట్రాక్టర్ కాలపరిమితి మార్చి 31తో ముగిసింది.దీంతో వేలంపాట నిర్వహణ ఆలస్యం అవ్వడంతో ఏప్రిల్ 1 నుండి 3 వ తేదీ వరకు పంచాయతీ సిబ్బంది నేరుగా రుసుములు వసూలు చేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఓ నాగరాజు నాయక్ మాట్లాడుతూ కొన్ని అనివార్య కారణాల వల్ల వేలంపాట నిర్వహణలో జాప్యం జరిగిందని కావున పంచాయతీ సిబ్బందితో కలిసి కూరగాయలు,పశువుల సంతలో రుసుము వసూలు చేసామని తెలిపారు.అలాగే నేడు శనివారం పశువుల సంతకు వేలంపాట నిర్వహిస్తున్నామని వేలంపాటలో పాల్గొనే వ్యక్తులు 8 లక్షల రూపాయలు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని, పంచాయతీ షరతులకు లోబడి వేలంపాట జరుగుతుందని తెలిపారు.

